క్లుప్తంగా

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



బహుమతులు ప్రదానం చేస్తున్న నాయకులు

కొత్తూరు: ప్రధాని మోదీ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా బీజేపీ నాయకులు శనివారం పట్టణంలోని కృష్ణవేణి పాఠశాలలో సేవ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు పలు అంశాలపై చిత్రలేఖనం, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు నాయకులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు అమడపురం నర్సింహాగౌడ్, మల్లేశ్, విజయభాస్కర్‌రెడ్డి, ప్రభాకర్, శివనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీఓకు నివాళి



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ అపర్ణ, అధికారులు

షాబాద్: అనారోగ్యంతో షాబాద్ ఎంపీఓ దీపాల శ్రీనివాస్ (50) శనివారం మృతి చెందారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అధికారులు ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. నివాళులర్పించిన వారిలో ఎంపీడీఓ అపర్ణ, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, ఏపీఓ వీరాసింగ్, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

పాఠశాలకు కుర్చీల బహూకరణ



కుర్చీలు అందిస్తున్న దాత ఈశ్వరయ్య

షాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులను దాతలు ఆదుకోవాలని ఉపాధ్యాయుడు మల్లేశ్‌గౌడ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని ఎల్గొండగూడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దాత కుమ్మరి ఈశ్వరయ్య 20 కుర్చీలు పంపిణీ చేశారు. అదేవిధంగా పల్లె విఠల్‌రెడ్డి, నల్లవల్లి అంజిరెడ్డి పాఠశాల ప్రహరీ ఏర్పాటుకు, రంగులు వేయడానికి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆంజనేయులుగౌడ్, గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవ



పాఠశాల ఆవరణను శుభ్రం చేస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులు

కేశంపేట: మండల పరిధిలోని కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పలువురు నాయకులు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు, చెత్తను తొలగించారు. పాఠశాలను శుభ్రపరిచారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జగన్, మాజీ సర్పంచ్ నవీన్‌కుమార్, నాయకులు కృష్ణ, కల్పన, వెంకటేశ్, లక్ష్మయ్య, సంతోష్, ఆంజనేయులు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



దేవేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు, ఉపాధ్యాయులు

కొందుర్గు: మండలంలోని ముట్పూర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు దేవేందర్‌రెడ్డి జిల్లా స్థాయి ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను శనివారం పాఠశాల సిబ్బంది, గ్రామస్తుల ఆధ్వర్యంలో శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అనురాధ, ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం రాజ్‌కుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ సత్యమ్మ, పంచాయతీ కార్యదర్శి అరుణ, జీపీఓ నరేశ్‌కుమార్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముందస్తు బతుకమ్మ సంబురాలు



మొయినాబాద్‌రూరల్: బతుకమ్మలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు



మొయినాబాద్: ఎనికేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో..

చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం ముందస్తు బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి తీరొక్క పూలతో బతుకమ్మలు తయారుచేశారు. అనంతరం పాఠశాల ఆవరణల్లో బతుకమ్మలను ప్రతిష్ఠించి ఆటాపాటలతో సందడి చేశారు. నృత్యాలు, కోలాటాలు ఆకట్టుకున్నాయి. అనంతరం బతుకమ్మలను ఆయా చెరువులు, కుంటలలో నిమజ్జనం చేసేందుకు తీసుకెళ్లారు.



షాబాద్: బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు



కొందుర్గు: బతుకమ్మలతో ఉపాధ్యాయులు, విద్యార్థినులు



మొయినాబాద్: బతుకమ్మలను తీసుకెళ్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



షాబాద్: ఎల్గొండగూడ ప్రాథమిక పాఠశాలలో..



షాబాద్: నాగర్‌గూడ ప్రాథమిక పాఠశాలలో..



చేవెళ్ల: బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు



చేవెళ్ల: బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



షాద్‌నగర్‌రూరల్: వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



షాద్‌నగర్‌రూరల్: బతుకమ్మలతో ఉపాధ్యాయులు



షాద్‌నగర్‌రూరల్: బతుకమ్మ ఆడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పెంపుడు కుక్కలకు వ్యాక్సినేషన్

శంకర్‌పల్లి: రేబిస్ ఫ్రీ తెలంగాణకు అందరం కలిసికట్టుగా పనిచేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ యోగేశ్ అన్నారు. శనివారం బ్లూ క్రాస్ సొసైటీ ఆఫ్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో పట్టణంలో మాస్ యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించగా... కమిషనర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 15 పెంపుడు కుక్కలకు వ్యాక్సినేషన్, 24 వీధి కుక్కలను స్టెరిలైజేషన్ కోసం తరలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రేబిస్ ఫ్రీ తెలంగాణ కోసం ప్రతి ఒక్కరూ ముందుకురావాలని, ఇంట్లో, వీధుల్లో కుక్కలకు సంబంధించి సమాచారాన్ని తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పర్యావరణాధికారి ఆనంద్, బ్లూ క్రాస్ సొసైటీ సభ్యులు కుమారి, రింకుల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పెంపుడు కుక్కకు వ్యాక్సినేషన్ చేస్తున్న సిబ్బంది, పక్కన కమిషనర్ యోగేశ్

పింఛన్లు పెంచాలని వినతి



కారోబార్ జగన్‌కు వినతిపత్రం అందజేస్తున్న లబ్ధిదారులు, నాయకులు

మొయినాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు పెన్షన్‌లు వెంటనే పెంచాలని లేనిచో ఉద్యమాలు చేపడతామని దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడు కొండిగారి మహేందర్ అన్నారు. శనివారం మండల పరిధిలోని బాకారం గ్రామ పంచాయతీ ఎదుట ఒంటరి మహిళలు, వృద్ధులు, దివ్యాంగులతో కలిసి నిరసన తెలిపి కారోబార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వం వెంటనే పింఛన్లు పెంచి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు డి.రాజు, సురంగల్ గ్రామ అధ్యక్షులు కుమార్, పద్మమ్మ, పార్వతమ్మ, పాండుచారి, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గామాత ఆగమన్

చేవెళ్ల: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చేవెళ్లలో ప్రతిష్ఠించే దుర్గామాత అమ్మవారి విగ్రహాన్ని శనివారం రాత్రి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా దుర్గామాత ఆగమన శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. దుర్గామాత కమిటీ నిర్వాహకులు మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విద్యుత్ దీపాలంకరణలతో డప్పు, చప్పుళ్ల మధ్య అమ్మవారికి ఘనంగా స్వాగతం పలికారు. చేవెళ్లలోని రచ్చబండ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపంలో దుర్గామాత అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి.. నవరాత్రుల్లో ప్రత్యేక పూజలు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తిశ్రద్ధలతో జరిగే ఈ ఉత్సవాల్లో మండపం వద్ద ప్రతీ రోజు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.



శోభాయాత్రలో పాల్గొన్న నిర్వాహకులు, నాయకులు, యువకులు

న్యాయవాదులకు అభినందన



న్యాయవాదులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: పబ్లిక్ ప్రాసిక్యూటర్లుగా నియమితులైన న్యాయవాదులను శనివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఘనంగా సత్కరించారు. పోక్సో కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సబియా సుల్తానా, అదనపు సెషన్స్ కోర్టు ప్రాసిక్యూటర్‌గా నియమితులైన చంద్రశేఖర్‌రెడ్డితో పాటు పలువురు న్యాయవాదులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్లను ఆయన ఘనంగా సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో న్యాయవాదులు రఘునాథ్‌శర్మ, మంగు మోహన్‌రావు, ప్రభాకర్‌గౌడ్, నాయకులు బాబర్‌ఖాన్, తిరుపతిరెడ్డి, మసూద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: నియోజకవర్గ ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నానని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. చేవెళ్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నియోజవర్గంలోని ఐదు మండలాలకు సంబంధించి 145 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన 65 లక్షల 67 వేల రూపాయల చెక్కులను ఆయా మండలాల నాయకులతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయాలకతీతంగా ఇప్పటివరకు 10కోట్లకుపైగా సీఎం సహాయనిధి చెక్కులను నియోజకవర్గంలోని పేదలకు అందించినట్లు తెలిపారు. పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. తనది బీఆర్ఎస్ పార్టీయేనని, అభివృద్ధి కోసమే ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నానని తెలిపారు. పార్టీలు మారే చరిత్ర ఎవరిది.. ఎవరు ముందుగా పార్టీలు మారారో ప్రజలకు తెలుసని, అన్ని పార్టీలు అయిపోయాయి ఇక ఎంఐఎం, సీపీఐ పార్టీలే మిగిలాయని మాజీ ఎమ్మెల్యే రత్నంను ఉద్దేశించి ఆయన అన్నారు. మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. మాజీ ఎమ్మెల్యే చరిత్ర అందరికీ తెలుసని, అతను జెడ్పీ చైర్మన్‌గా ఉన్నప్పటి నుంచి ఎమ్మెల్యేగా చేసిన అభివృద్ధి ఏమిటో చూపించాలని సవాల్ విసిరారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తున్నానన్నారు. సమావేశంలో టీపీసీసీ నాయకులు జనార్ధన్‌రెడ్డి, జిల్లా, నియోజకవర్గ నాయకులు వసంతం, దర్శన్, ఆగిరెడ్డి, ఎం.కృష్ణారెడ్డి, కాలె శ్రీకాంత్, దావల్‌గారి గోపాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు గోనే ప్రతాప్‌రెడ్డి, డి.వెంకట్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, వైస్ చైర్మన్‌లు బి.రాములు, మల్లేశ్, రవీందర్‌రెడ్డి, మానిక్యరెడ్డి, పాండుగౌడ్, జనార్దన్, రాంరెడ్డి, మహేందర్, శ్రీనివాస్, యాదయ్య, విజయ్, దయాకర్, రాములు, ఆయా మండలాల నాయకులు ఉన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

ఉన్నత చదువులతోనే గుర్తింపు

సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ



సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న సేవాసమితి సభ్యులు

చేవెళ్ల: ప్రతి ఒక్క విద్యార్థి ఉన్నత లక్ష్యంతో కష్టపడి చదివి సమాజంలో గుర్తింపు స్థాయిలో నిలబడాలని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో శనివారం సత్యసాయి సేవామితి, చేవెళ్ల, రంగారెడ్డి జిల్లా శాఖల వారి ఆధ్వర్యంలో కళాశాలల విద్యార్థులకు మానవత విలువలపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సైకాలజిస్ట్, మోటివేటర్లు మల్లేశ్, గంప నాగేశ్వర్‌రావు, నార్కోటిక్స్ విభాగం ఎస్పీ కృష్ణమూర్తితో పాటు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా జేడీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తు చేసుకుంటూ వారి కలలను సాకారం చేసేందుకు చదువుల్లో మంచి ఫలితాలతో రాణించాలని సూచించారు. దేశం కోసం ధర్మ కోసం పాటుపడాలన్నారు. మోటివేటర్లు మాట్లాడుతూ.. మన నిజమైన హీరోలు తల్లిదండ్రులు, దేశం కోసం ప్రాణాలను అర్పిస్తున్న సైనికులు, విద్యాబుద్ధులు నేర్పించే ఉపాధ్యాయులని గుర్తుంచుకోవాలన్నారు. విద్యార్థి దశలో ఆడుతూ పాడుతూ హాయిగా చదువుకోవాలన్నారు. ఉన్నతమైన లక్ష్యసాధనకు కష్టపడాలని అప్పుడే సమాజంలో గుర్తింపు వస్తుందని తెలిపారు. చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలన్నారు. చెడు వ్యసనాలకు లోను కాకుండా దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యాత్మిక కో–ఆర్డినేటర్ రేగళ్ల అనిల్‌కుమార్, రాష్ట్ర విద్యావిభాగం కో–ఆర్డినేటర్ హరినాథ్‌రెడ్డి, సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు యాదగిరిరావు, గోపాలచారి, వివేకానంద కళాశాల ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శైలజాఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సమత, సత్యసాయి సేవా సంస్థ చేవెళ్ల, జిల్లాశాఖ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కబ్జాచేస్తే చర్యలు

- అధికారులను బెదిరిస్తే ఊరుకునేది లేదు
- తహసీల్దార్ గౌతమ్‌కుమార్



ప్రభుత్వ భూమిని గుర్తిస్తున్న తహసీల్దార్ గౌతమ్‌కుమార్, సిబ్బంది

మొయినాబాద్ రూరల్: కోట్ల విలువలు చేసే సర్కార్ భూములను కబ్జా చేస్తే ప్రభుత్వపరంగా కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ గౌతమ్‌కుమార్ హెచ్చరించారు. ఈ సందర్భంగా మండలంలోని తోల్‌కట్ట రెవెన్యూ పరిధిలో గల దాదాపు 20 కోట్లకు పైగా విలువచేసే సర్కార్ భూమిపై అక్రమార్కులు కన్నువేసి కబ్జా చేస్తున్నారనే.. సమాచారంతో మండల రెవెన్యూ సిబ్బందితో కలిసి తహసీల్దార్ తోల్‌కట్టలోని ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఈ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 155లో 14 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా.. ఇందులో ఏడు ఎకరాలను హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యాపారి నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్ నిర్మాణం చేస్తున్నారన్నారు. సర్కార్ భూమికి ఆనుకొని తన భూమి మూడు ఎకరాలు ఉండడంతో ఈ భూమిని కలుపుకొని మధ్యలో రోడ్లు సైతం వేశారన్నారు. గ్రామస్తుల సమాచారంతో కిందిస్థాయి రెవెన్యూ అధికారులు అక్కడికి వెళ్లేసరికి కబ్జా చేస్తున్న అక్రమార్కులు వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలియడంతో తాను మరింత సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏడు ఎకరాలకు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. ప్రభుత్వ భూమి కబ్జాకు గురైతే ప్రభుత్వపరంగా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

రుణాల చెల్లింపునకు కృషి

మండల మహిళా సమాఖ్య ఏపీఎం నర్సింలు



మాట్లాడుతున్న ఏపీఎం నర్సింలు

మొయినాబాద్‌రూరల్: మండలంలో ఆయా మహిళా సంఘాలు తీసుకున్న రుణాలు సమయానికి బ్యాంకుల్లో చెల్లించేందుకు వీవోఏలు కృషి చేయాలని మండల మహిళా సమాఖ్య ఏపీఎం నర్సింలు అన్నారు. శనివారం మండల మహిళా సమాఖ్య భవనంలో మండలంలోని 51 మంది వీవోఏలతో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత సంవత్సరంలో మహిళా సంఘాలు తీసుకున్న రుణాలను సమయానికి చెల్లించేందుకు కృషి చేయాలన్నారు. దీంతో సంఘాలకు తిరిగి వెంటనే రుణాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇందుకుగాను ఆయా గ్రామాల్లోని వీవోఏలు సమావేశాలను ఏర్పాటు చేసుకొని వారు తీసుకున్న రుణాలను పరిశీలించి చెల్లించే విధంగా చూడాలని సూచించారు. సమావేశంలో మండలంలోని అన్ని గ్రామాల వీవోఏలు పాల్గొన్నారు.